ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
మంగళవారం 14 మే 2024



డుంబ్రిగుడ పోలింగ్ కేంద్రం వద్ద బారులుతీరిన ఓటర్లు

ఓటెత్తిన గిరిజనం

జిల్లాలో ప్రశాంతంగా సార్వత్రిక ఎన్నికలు

- పాడేరు, అరకులోయ, రంపచోడవరంలో 57.4 శాతం పోలింగ్
- పోలింగ్ ప్రక్రియను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు వివేకానందన్, కరణ్‌సింగ్

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

గిరిజనులు ఓట్లేసేందుకు గతానికి భిన్నంగా అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. అలాగే ఎంత సమయమైనా వేచి ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గిరిజన ప్రాంతంలో మండల, పంచాయతీ కేంద్రాల్లో మినహా మారుమూల ప్రాంతాల్లో గతంలో ఆశించిన స్థాయిలో ఓటింగ్ ఉండేది కాదు. కానీ ఈసారి ప్రతి ఒక్కరూ తమ ఓటును వినియోగించుకోవాలనే ఆలోచనతో మారుమూల ప్రాంతాల్లోని గిరిజనులు ఓట్లేసేందుకు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు.



పాడేరులో ఓటు వేస్తున్న కలెక్టర్ ఎం.విజయసునీత



పీల్‌చైర్ అందుబాటులో లేక కుర్చీలో దివ్యాంగురాలిని చింతపల్లి పోలింగ్ బూత్‌కి తీసుకు వస్తున్న కుటుంబ సభ్యులు

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైనా ముంచంగిపుట్టు మండలం లక్ష్మీపురం, బరడ, బూసిపుట్టు, కుమడ, పెదబయలు మండలంలో రూడకోట, కొరవంగి, ఇంజెరి, చింతపల్లి మండలంలో బలపం వంటి ప్రదేశాల్లో సైతం గిరిజనులు ప్రశాంతంగా ఓట్లే శారు. ఉన్నంతలో విద్యావంతుల కంటే నిరక్షరాస్యులైన మారుమూల ప్రాంత గిరిజనులే అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనడం విశేషం. కాగా మొత్తం ఓటర్లలో ఎక్కడ చూసినా మహిళలే అధిక సంఖ్యలో కనిపించారు. పురుష ఓటర్ల కంటే మహిళలే అధికంగా పోలింగ్‌లో పాల్గొన్నారని అధికారులు భావిస్తున్నారు. మొత్తం పోలింగ్ సరళి, ప్రక్రియను ఎన్నికల పరిశీలకులు కె.వివేకానందన్, కరణ్‌సింగ్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత పర్యవేక్షణలో పాడేరు, అరకులోయ, రంపచోడవరం రిటర్నింగ్ అధికారులు భావనవశిష్ఠ, అభిషేక్, ప్రశాంత్‌కుమార్ నిర్వహించారు.



పెదబయలులో ఎండలోనే ఓటేసేందుకు బారులు తీరిన గిరిజనులు



జి.ముంచంగిపుట్టులో ఓటేసేందుకు పొలం గట్ల పైనుంచి నడుచుకుంటూ వస్తున్న జల్లిపల్లి ఓటర్లు



పాడేరులో పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్పీ తుహిన్‌సిన్హా



చింతపల్లి మండలం చౌడుపల్లి పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

జిల్లాలో 57.4 శాతం పోలింగ్

- గతంతో పోలిస్తే కాస్త తగ్గే అవకాశం?
- పాడేరులో 55.4, అరకులోయలో 67.5, రంపచోడవరంలో 66.3 శాతం

జిల్లాలో 57.4 శాతం పోలింగ్ నమోదైందని తెలుస్తున్నది. సోమవారం రాత్రి 11 గంటలకు అందిన సమాచారం ప్రకారం జిల్లాలో పాడేరులో 55.4, అరకులోయలో 67.5, రంపచోడవరంలో 66.3 శాతం పోలింగ్ నమోదైందని అధికారులు అంటున్నారు. అనేక పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం నాలుగు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు ఓటింగ్ జరుగుతుండడంతో పాటు మొత్తం ఓటింగ్ వివరాలు క్రోడీకరించే పనులుండడంతో మంగళవారానికి పూర్తి స్థాయిలో ఓటింగ్ శాతం తెలిసే అవకాశం ఉంది. అయితే గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఓటింగ్ శాతం తగ్గే అవకాశాలున్నాయని తెలుస్తున్నది. 2019 ఎన్నికల్లో పాడేరు అసెంబ్లీ స్థానం పరిధిలో 61 శాతం, అరకులోయలో 70, రంపచోడవరంలో 78 శాతం పోలింగ్ నమోదైంది. కానీ ఈసారి తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి.



అరకు మండలం కొత్తభల్లుగుడలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



పాడేరు మండలం గుత్తులపుట్టు పోలింగ్ కేంద్రంలో క్యూలైన్‌లో ఓటర్లు

మొరాయించిన ఈవీఎంలు

- ఓటర్లకు తప్పని ఇబ్బందులు

పాడేరు, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం జరిగిన ఎన్నికల్లో గతం కంటే అధికంగా ఈవీఎంలు ఎక్కడికక్కడ మొరాయించాయి. దీంతో అనేక చోట్ల గంట పైబడి పోలింగ్ ఆలస్యంగా మొదలైంది. విషయం తెలుసుకున్న అధికారులు వాటిని సరిచేయడంతో పోలింగ్ మొదలైంది. కానీ సమయం వృథా కావడంతోపాటు ఓటర్లు ఎక్కువ సమయం వేచి ఉండడం వంటి ఇబ్బందులు పడ్డారు. సహనం లేని ఓటర్లు ఎంత సేపు నిరీక్షిస్తామని భావించి తిరిగి ఇళ్లకు వెళ్లిపోయిన సందర్భాలున్నాయి. పాడేరులోని పాతపాడేరు(283) పోలింగ్ కేంద్రంలో ఈవీఎంలు మొరాయించడంతో గంటన్నర ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. పాడేరు నియోజకవర్గం పరిధిలో సీలేరు, జి.మాడుగులలో, చింతపల్లి, జీకేవీధి మండలాల్లోనూ, అరకులోయ అసెంబ్లీ నియోజవర్గం పెదబయలు, గుల్లెలు, అరకులోయ, హుకుంపేట మండలాల్లో ఈవీఎంలు మొరాయించాయి. దీంతో ఆయా పోలింగ్ కేంద్రాల్లో గంటకు పైబడి ఆలస్యంగా పోలింగ్ ప్రక్రియ మొదలైంది. ఇవి వెలుగులోకి వచ్చిన కొన్ని మాత్రమే బాహ్య ప్రపంచానికి తెలియని అనేక పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించిన ఘటనలున్నాయి. అయితే సకాలంలో వాటిని సరిచేయడంతో కొంత వరకు ఇబ్బందులు తప్పాయి.



పాడేరులో వృద్ధుడిని పోలింగ్ కేంద్రానికి తీసుకువెళుతున్న దృశ్యం

పోలింగ్ వెబ్ కాస్టింగ్ పరిశీలన

- ఎన్నికల తీరును పరిశీలించిన జిల్లా ఎన్నికల పరిశీలకుడు



కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో వెబ్‌కాస్టింగ్ పరిశీలిస్తున్న వివేకానందన్

పాడేరు, మే 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం పోలింగ్ జరుగుతున్న తీరును వెబ్‌కాస్టింగ్ ద్వారా జిల్లా ఎన్నికల(సాధారణ) పరిశీలకుడు కె.వివేకానంద్ పరిశీలించారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటిని కలెక్టరేట్‌లోని ఎన్నికల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్ర్కీన్‌పై చూసుకునేలా వెబ్‌కాస్టింగ్ చేశారు. దీంతో సోమవారం పలు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరుగుతున్న తీరును ఆయన ఇలా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత, ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

జి.మాడుగులలో ఆర్వో పోలింగ్ కేంద్రాల సందర్శన

జిల్లాలోని జి.మాడుగుల మండలంలో పాడేరు అసెంబ్లీ స్థానం రిటర్నింగ్ అధికారి భావన వశిష్ఠ సోమవారం పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. మండలంలోని 234, 236, 238, 240, 243, 244, 245 నంబర్ల పోలింగ్ కేంద్రాల్లోని పరిస్థితులపై ఆమె ఆరా తీశారు. పోలింగ్ సరళి పరిశీలించి, రికార్డులను తనిఖీ చేసి పోలింగ్ చక్కగా నిర్వహించాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు.

లండన్ టూ పాడేరు

- ఓటేసేందుకు వచ్చిన ఎన్ఆర్ఐ విద్యార్థిని నవ్యదీపిక

పాడేరు, మే 13 (ఆంధ్రజ్యోతి): నగరాల్లో రెండు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటేయడానికే శ్రద్ధచూపని ఓటర్లున్న ప్రస్తుత పరిస్థితుల్లో పాడేరులోని తన ఓటును వినియోగించుకునేందుకు లండన్ నుంచి ఓ విద్యార్థిని ఇక్కడికి రావడం విశేషం. పాడేరులోని వర్తకుడు బూరెడ్డి నాగేశ్వరరావు కుమార్తె నవ్యదీపక లండన్‌లో మాస్టర్స్ చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సొంతూరు వచ్చి తను ఓటు వేయాలనే ఆసక్తితో రెండు రోజుల క్రితమే పాడేరు చేరుకుని సోమవారం ఇక్కడ తన ఓటును వినియోగించుకున్నారు. తన ఓటు కోసం విదేశాల నుంచి వచ్చిన నవ్యదీపికను పలువురు అభినందిస్తున్నారు.




బూరెడ్డి నవ్యదీపిక, ఎన్ఆర్ఐ

ఎవరి ధీమా వారిది!!

గెలుపుపై కూటమిలో సంపూర్ణ విశ్వాసం

- ఎంపీ అభ్యర్థికి లక్ష మెజారిటీ వస్తుందంటున్న టీడీపీ నేతలు



- విశాఖ జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో ఆరింటిలో గెలుపు ఖాయమని లెక్కలు
- మూడు అసెంబ్లీ సెగ్మెంట్లపై ఆశలు పెట్టుకున్న వైసీపీ
- ఎంపీ అభ్యర్థులకు క్రాస్ ఓటింగ్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సోమవారం ముగిసింది. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం రాత్రి పది గంటలు దాటిన తరువాత కూడా పోలింగ్ కొనసాగింది. బరిలో కాంగ్రెస్ పార్టీ, స్వతంత్ర అభ్యర్థులు ఎందరు ఉన్నా పోటీ ప్రధానంగా కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ), వైఎస్ఆర్‌సీపీల మధ్యే జరిగింది. పోలింగ్ సరళిని చూసి ఏ పార్టీకి ఆ పార్టీ తమదే విజయమని ధీమా వ్యక్తం చేస్తోంది. ఈసారి కొత్తగా ఓటు హక్కు చాలామందికి వచ్చిందని, యువతరం అంతా చంద్రబాబునాయుడుపై నమ్మకంతో కూటమికే ఓట్లు వేశారని టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు విశ్వసిస్తున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు అంతా అధికార పార్టీ విధానాలతో విసుగెత్తిపోయి ఉన్నారని, వారంతా కూటమి వెంటే ఉన్నారని చెబుతున్నారు. అయితే మహిళలు పెద్దఎత్తున పోలింగ్‌కు తరలి వచ్చారని, అలాగే వృద్ధులు కూడా ఓపిక చేసుకొని వచ్చారని, వారి ఓట్లు తమకే పడతాయిని వైసీపీ భావిస్తోంది. విశాఖ ఎంపీ

... మిగతా 8వ పేజీలో

పాడేరు, అరకులోయలోనూ అదే ధీమా



గిడ్డి ఈశ్వరి



మత్స్యరాస విశ్వేశ్వరరాజు



పాంగి రాజారావు



రేగం మత్స్యలింగం

- పాడేరు, అరకులోయ స్థానాలు తమవేనన్న ఆత్మవిశ్వాసంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు

పాడేరు, మే 13 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పాడేరు, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గాల్లో తమ పార్టీకి ఎంత మేరకు ఓట్లు పడ్డాయనే అంచనాలను రూపొందించడంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు, శ్రేణులు నిమగ్నమయ్యారు. అలాగే ఎవరికి వాళ్లు తమదే గెలుపనే ధీమాతో ఉన్నారు. కాగా పాడేరు అసెంబ్లీ స్థానంలో కూటమి గెలుపు ఖాయమని టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి పేర్కొంటున్నారు. అయితే తాను అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తానని వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరాజు ధీమా వ్యక్తం చేస్తున్నారు. జగన్ పాలనపై వ్యతిరేకత, తమ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ కూటమి మేనిఫెస్టో ప్రభావం తనకు కలిసొస్తుందని టీడీపీ అభ్యర్థి అభిప్రాయపడుతున్నారు. ఇలా ఎవరి అంచనాల్లో వారు ఉన్నారు.

అరకులోయలో..

అరకులోయ అసెంబ్లీ స్థానంలో వైసీపీ రెబల్, స్వతంత్ర అభ్యర్థుల ప్రభావంతో ఓట్లలో చీలిక కారణంగా ఎవరు గెలుస్తారనేది కచ్చితంగా చెప్పలేని పరిస్థితి నెలకొందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. వైసీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం సామాజిక వర్గానికి చెందిన వాళ్లయిన బీజేపీ అభ్యర్థి పాంగి రాజారావు, స్వతంత్ర అభ్యర్థి సివేరి అబ్రహం పోటీలో ఉండడంతో భారీగా చీలాయని తెలుస్తున్నది. మరో సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ అభ్యర్థి శెట్టి గంగాధరస్వామి, మరో స్వతంత్ర అభ్యర్థి సమర్ధ రఘునాథ్‌లు సైతం వైసీపీ ఓట్లను భారీగానే చీల్చారని అంటున్నారు. దీంతో ఎవ రెవరికి ఎన్ని ఓట్లు పడ్డాయనేది కచ్చితంగా అంచనా వేయలేకపోతున్నారు. దీంతో గెలుపు ఎవరిదనే విషయం తెలియడం లేదంటున్నారు, కానీ కూటమి శ్రేణుల సహకారంతో తాను గెలుస్తానని పాంగి రాజారావు అంటుండగా, నియోజకవర్గంలో తమ పట్టుసడల లేదని, తమదే విజయమని వైసీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం అంటున్నారు. ఇలా ఎవరికి వాళ్లు గెలుస్తామనే ధీమాతో

... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

యువకుడిపై వైసీపీ నాయకుల దాడి

- టీడీపీకి అనుకూలంగా పనిచేశాడని ఆగ్రహం
- తీవ్ర గాయాలతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్సలు
- జేపీ అగ్రహారం గ్రామంలో ఘటన


దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న రామ్‌ప్రసాద్

రోలుగుంట, మే 13: టీడీపీకి అనుకూలంగా పనిచేసి, ఓటు వేశాడనే ఉద్దేశ్యంతో వైసీపీకి చెందినవారు పలువురు ఓ యువకుడిపై దాడిచేశారు. తీవ్ర గాయాలకు గురైన సదరు యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం రాత్రి మండలంలోని ఓ గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి టీడీపీ నాయకులు తెలిపిన వివరాలివి. జేపీ అగ్రహారం గ్రామానికి చెందిన తమరాన రామ్‌ప్రసాద్ అనే యువకుడు ఐటీఐ పూర్తి చేసి ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. సోమవారం ఓటు వేయడానికి స్వగ్రామం వచ్చాడు. టీడీపీ నాయకులతో ఉంటూ, ఆ పార్టీకే ఓటు వేశాడని భావించిన వైసీపీకి చెందిన సర్పంచ్ కుమారుడు చిటికెల అనంత్, వబ్బలరెడ్డి శివ అనే ఇద్దరూ రామ్ ప్రసాద్‌ను ఆపారు. నువ్వు టీడీపీకి పనిచేస్తావా.., ఓటు వేస్తావా.. అంటూ కాలర్ పట్టుకుని, కాళ్లతో తన్ని దాడిచేసి తీవ్రంగా గాయపర్చారని టీడీపీ నాయకులు ఆరోపించారు. దీంతో టీడీపీకి చెందిన మాజీ సర్పంచ్ రొంగలి రమణ, ఇతర నాయకులు రామ్‌ప్రసాద్‌ను చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రోలుగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డి.సురవరంలో కూటమి-వైసీపీ వర్గీయుల బాహాబాహీ

- టీడీపీ కార్యకర్తకు గాయాలు
- రంగప్రవేశం చేసిన పోలీసులు


తోపులాటలో గాయపడిన టీడీపీ కార్యకర్త రాము

మాడుగుల రూరల్, మే 13: మండలంలోని సాగరం పంచాయతీ డి.సురవరం పోలింగ్ కేంద్రం వద్ద కూటమి, వైసీపీ వర్గీయులు సోమవారం బాహాబాహీకి దిగడంతో తోపులాట చోటుచేసుకుంది. వైసీపీకి చెందిన నాయకులు పోలింగ్ కేంద్రం వద్దకు ఓటర్లను తీసుకు వచ్చి, వైసీపీకి ఓటేయాలని చెప్పడం, బూత్‌లోకి వెళ్లే ప్రయత్నం చేయడం వంటి వాటిని అక్కడి టీడీపీ, జనసేన నాయకులు వారిని అడ్డుకున్నారు. దీంతో మాటా మాటా పెరిగి తోపులాట జరగడంతో టీడీపీ కార్యకర్త బాలిబోయిన రాము నుదుటిపై బైక్ తాళంతో వైసీపీ వర్గీయులు దాడి చేసి గాయపర్చారు. ఇది గుర్తించిన పోలీసులు ఇరువర్గాలను అక్కడి నుంచి పంపివేయడంతో వివాదం సద్దుమణిగింది.

ఓటేసి వస్తూ..మృత్యు ఒడికి చేరిన వృద్ధురాలు

- చోడవరం మండలంలో ఘటన

చోడవరం, మే 13: ఓటు వేయడానికొచ్చిన ఓ వృద్ధురాలు, పోలింగ్ కేంద్రం నుంచి బయటకు వస్తూ మృతిచెందింది. అనకాపల్లి జిల్లా చోడవరం పట్టణ శివారు గాంధీగ్రామం పంచాయతీ సిటిజన్ కాలనీకి చెందిన జయవరపు నాగయ్యమ్మ (75)ను ఓటు వేసేందుకు ఆమె కుటుంబ సభ్యులు సోమవారం మధ్యాహ్నం తమ ఇంటి సమీపంలోని పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చారు. వీల్‌ఛైర్‌లో వచ్చిన నాగయ్యమ్మ పోలింగ్ కేంద్రం లోపలకు వెళ్లి ఓటేసింది. ఆ తరువాత ఆమెను బయటకు తీసుకుని వచ్చారు. పోలింగ్ కేంద్రం నుంచి బయటకు రాగానే ఆమె కన్నుమూసింది. దీంతో బంధువులు విషాదంలో మునిగిపోయారు. గత రెండు సంవత్సరాలుగా ఆమె అనారోగ్యంతో మంచానికే పరిమితమైంది.

ఓటర్లను తీసుకువెళ్తూ.. వ్యాన్ బోల్తా

15 మందికి తీవ్ర గాయాలు... ముగ్గురి పరిస్థితి విషమం


బోల్తా పడ్డ వ్యాన్... సంఘటనా స్థలంలో గాయాలతో ఉన్న బాధితులు

అరకులోయ, మే 13: ఓటర్లను పోలింగ్ కేంద్రానికి తీసుకువెళ్తున్న ఓ వ్యాన్ అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో 15 మందికి తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటనలకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి...

అనంతగిరి మండలంలోని పెదకోట పంచాయతీ సీడివలస, పాటిపల్లి గ్రామాలకు చెందిన 35 మంది ఓటర్లను ఓ వ్యాన్ పోలింగ్ సోమవారం మధ్యాహ్నం బూత్-295కు తరలిస్తున్నది. ఈ క్రమంలో కుడియా వద్దకు వచ్చేసరికి వ్యాన్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో పాటిపల్లి వెలమామిడి, సీడివలస గ్రామాలకు చెందిన 15 మంది ఓటర్లను గాయపడ్డారు. పాటిపల్లి గ్రామానికి చెందిన ఉల్లి చిన్న, ఉల్లి ఎండమ్మ, ఉల్లి ఈశ్వరమ్మలకు తలపై తీవ్రంగా గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా మారింది. వీరితో పాటు మరో 12 మందికి గాయాలు కావడంతో పినకోట పీహెచ్‌సికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేయించారు. పరిస్థితి ఆందోళనకంగా ఉన్న ముగ్గుర్ని విశాఖపట్నం కేజీహెచ్‌కే తరలించారు.

ఓటు వేద్దామని బయలుదేరితే...

- రైలు ఆలస్యంతో నిరాశ

విశాఖపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎంతో దూరం నుంచి ఓటు వేయడానికి బయల్దేరిన వారికి చివరకు నిరాశే మిగిలింది. రైల్వే శాఖ నిర్లక్ష్యంతో సకాలంలో గమ్యస్థానానికి చేరుకోలేక ఓటుకు దూరమయ్యారు. జిల్లాకు చెందిన పలువురు ఉపాధి, ఉద్యోగ రీత్యా నాందేడ్‌లో ఉంటున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు ఉపయోగించుకోవాలని నాందేడ్- విశాఖపట్నం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరారు. ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు అక్కడ బయల్దేరాల్సిన రైలు ఆరు గంటల ఆలస్యంగా బయల్దేరింది. సోమవారం ఉదయం 5.50 గంటలకు సికింద్రాబాద్ చేరింది. షెడ్యూల్ ప్రకారం సోమవారం ఉదయం 9.10 గంటలకు విశాఖ చేరుకోవాలి. ఎక్కడికక్కడే ఆపేయడం వల్ల సికింద్రాబాద్ చేరేసరికి 9 గంటలు ఆలస్యమయింది. ఓటు వేసే అవకాశం కోల్పోతామని ప్రయాణికులు అధికారులకు, రైల్వేస్టేషన్లలో మాస్టర్లకు ఫిర్యాదు చేశారు. కానీ పరిస్థితి మెరుగుపడలేదు. దాంతో వారు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు. తమకు ఎవరైనా సాయం చేయాలని కోరారు. ఎంత రాత్రి అయినా ఓటు హక్కు కల్పించేలా చూడాలని వారంతా వేడుకున్నారు.

చికెన్ ధరలు


బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

పోటెత్తిన ఓటర్లు

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సోమవారం మందకొడిగా ప్రారంభమై సాయంత్రం వరకు అదే రీతిలో కొనసాగింది. ఉదయం 7 గంటల సమయానికే కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరినప్పటికీ ప్రక్రియ వేగవంతం కాకపోవడంతో గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. తొలిసారి ఓటు హక్కు పొందిన యువ ఓటర్లు కూడా ఓటు వేసేందుకు ఉత్సాహం చూపించారు. వారితో పాటు వృద్ధులు, దివ్యాంగులను కేంద్రాలకు తరించిన వారి కుటుంబసభ్యులు దగ్గరుండి మరీ ఓట్లు వేయించారు. చాలాచోట్ల ఈవీఎంల మొరాయింపు, ఓటింగ్ ఆలస్యంగా ప్రారంభం కావడం, ప్రక్రియ నత్తనడకన సాగడంతో రాత్రి 8 గంటల వరకు కేంద్రాల వద్ద ఓటర్లు బారులుతీరి నిల్చునే పరిస్థితి ఎదురయింది.


అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం పోలింగ్ కేంద్రంలో బారుల తీరిన ఓటరు


నక్కపల్లి పోలింగ్ కేంద్రంలో క్యూలో నిలబడిన టీడీపీ అభ్యర్థి అనిత


అచ్యుతాపురం మండలం దొప్పెర్లలో నడవలేని స్థితిలో ఉన్న వృద్ధుడిని ఓటు వేయడానికి తీసుకు వెళుతున్న దృశ్యం


పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు


పాడేరు బస్సులో వచ్చిన పోలింగ్ సిబ్బంది


అనకాపల్లి గవరపాలెంలోని ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రంలో బారులుతీరిన ఓటర్లు


కోటవురట్ల మండలంలోని కె. వెంకటాపురం పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు


గొలుగొండ మండలంలోని చీడిగుమ్మల గ్రామంలో ఉదయం ఏడు గంటలకే బారులు తీసిన ఓటర్లు


పరవాడ మండలం తానాంలో వృద్ధురాలిని పోలింగ్ కేంద్రానికి తీసుకువస్తున్న దృశ్యం


ఎలమంచిలి రైల్వే స్టేషన్ రోడ్డు పోలింగ్ కేంద్రానికి వృద్ధురాలిని తీసుకువస్తున్న యువకుడు


నర్సీపట్నం: వెంకునాయుడు స్కూల్ వద్ద ఓటు వేసేందుకు ఎండలో క్యూలో ఉన్న ఓటర్లు


అచ్యుతాపురం మండలం పూడిమడకలో బార్లు తీరిన ఓటర్లు


అరకులోయ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరిన ఓటర్లు


పాయకరావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బారులు తీరిన ఓటర్లు


225 పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ మంత్రి దాడి కుటుంబ సభ్యులు


అరకులోయ: అడవుల్లో నుంచి వృద్ధుడ్ని ఓటు వేయడం కోసం పోలింగ్ కేంద్రానికి డోలీలో మోసుకువస్తున్న బూరుగు, చినకూరెల గ్రామాల గిరిజనులు


ఎలమంచిలి రైల్వే స్టేషన్ రోడ్డు స్కూలు వద్ద తల్లి ఓటు వేసేందుకు వెళ్లడంతో ఉన్న 3 నెలల చిన్నారితో ఓ తండ్రి


దిబ్బపాలెం పోలింగ్ కేంద్రంలో రాత్రి తొమ్మిదిన్నర గంటలు దాటినా కొనసాగిన పోలింగ్


పాడేరు: పెదబయలు మండలం పరదానిపుట్టు పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు


మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన కుంకుంపూడి పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు


చింతపల్లిలో మండుటెండలోనూ ఓటు కోసం క్యూ కట్టిన గిరిజనులు

మన్యంలో ప్రశాంతంగా ఎన్నికలు

ఉదయానికే పోలింగ్ కేంద్రాలకు పోటెత్తిన గిరిజనం

చాంతాడంత క్యూల్లో మండుటెండలోనూ నిరీక్షణ

భారీ వర్షంలోనూ ఓపిగ్గా క్యూ కట్టిన ఓటర్లు

మన్యంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. సోమవారం ఉదయానికే చాలా పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారు. మండుటెండలోనూ ఓటు వేసేందుకు నిరీక్షించారు. చాంతాడంత క్యూల్లోనూ విసుగు చెందకుండా ఓపిగ్గా ముందుకు కదిలారు. అలాగే భారీ పోలీసు బందోబస్తుతో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగక పోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పాడేరు రూరల్, మే 13: పాడేరు మండండలంలోని 67 పోలింగ్ కేంద్రల్లో 44 వేల 280 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల ప్రక్రియ సాయంత్రం 4 గంటల వరకు జరిగినా, మధ్యాహ్నం 3 గంటల నుంచి అరగంట పాటు భారీగా వర్షం కురవడంతో క్యూలో ఉన్న ఓటర్లు ఇబ్బంది పడడంతో పాటు ఓటింగ్ ఆలస్యమైంది. అయినప్పటికీ క్యూలో నిరీక్షించారు. దీంతో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ శాతం వివరాలను సంబంధిత అధికారులు తెలియజేయలేదు. మినుములూరు, పాడేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఒక పోలింగ్ బూత్, గుడివాడ, దుమ్మాపుట్టు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటింగ్ కొంతమేర ఆలస్యమైంది. అధికారులు తక్షణమే స్పందించి ప్రత్యామ్నాయంగా ఈవీఎంలు ఏర్పాటు చేశారు. వృద్ధులు, వికలాంగులను వారి కుటుంబ సభ్యులు పోలింగ్ కేంద్రాల వద్దకు తీసుకురాగా ఎన్నికల సిబ్బంది, పోలీసు సిబ్బంది వారిని కేంద్రాల్లోకి తీసుకువెళ్లి ఓటింగ్ చేయించేందుకు సహకరించారు. కాగా, దుమ్మాపుట్టు, దబ్బాపుట్టు పోలింగ్ కేంద్రాలు మధ్యాహ్నం నిర్మానుష్యంగా కనిపించాయి.

చింతపల్లిలో...

చింతపల్లి: మండలంలో 55 శాతం పోలింగ్ జరిగింది. మొత్తం 63,130 ఓటర్లకు ఉండగా, 78 పోలింగ్ కేంద్రాల్లో 40,903 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోల్చుకుంటే 6 శాతం పోలింగ్ పెరిగింది. మండలంలో పలు పోలింగ్ కేంద్రాల్లో ఉదయం ఏడు గంటల నుంచి ఓటర్లు బారులు తీరారు. చౌడుపల్లి, బైలుకించంగి, తాజంగి, లంబసింగి పోలింగ్ కేంద్రాల్లో ఉదయం తొమ్మిది గంటలకే క్యూ భారీగా కనిపించింది. చౌడుపల్లి, బైలుకించంగి, తాజంగి పోలింగ్ కేంద్రాల్లో ఎండ తీవ్రతకు ఓటర్లు కూర్చొని క్యూ పాటించారు. అదే సమయంలో వర్షం పడడంతో ఓటర్లు కొంత ఇబ్బందికి గురయ్యారు. వర్షం తగ్గిన తరువాత యధావిధిగా పోలింగ్ జరిగింది. తాజంగి, కిన్నెర్ల, లంబసింగి కేంద్రాల్లో రాత్రి 7గంటల వరకు పోలింగ్ జరిగింది. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయకపోవడం వల్ల కుటుంబ సభ్యులు పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చి ఓటు వేయించారు. కాగా, సీపీఐ మావోయిస్టు పార్టీకి కంచుకోటగా పేరొందిన బలపం పంచాయతీలో ఆదివాసీలు ఓటు వేసేందుకు ఆసక్తి చూపారు. ఈ పంచాయతీలో 60 శాతం ఓటింగ్ శాతం నమోదైంది. ప్రశాంతంగా ఎన్నికలు జరగడంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

అరకులోయలో...

అరకులోయ: మండలంలో 55.85 శాతం పోలింగ్ నమోదైంది. అరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని నాలుగు బూత్‌లు ఏర్పాటు చేశారు. మాక్ పోలింగ్ జరగక ముందే ఓటర్లు బారులు తీరారు. కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయించడంలో 8 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. కొండవీఽ పాఠశాలలో మాజీ మంత్రి శ్రావణ్‌కుమార్ ఓటు వినియోగించగా, ఇండియా కూటమి ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్స బొండాంలో ఓటు వేశారు. శివలింగపురం పోలింగ్ బూత్‌లో అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి గంగాధర్‌స్వామి ఓటు వేశార. సాయంత్రం 4 గంటల తర్వాత ఉరుములు, పిడుగులతో మోస్తరు వర్షం పడింది. అయినా ఓటర్లు ఓపిగ్గా నిరీక్షించి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

కాగా, అనంతగిరి మండలం మారుమూల రోంపిల్లి పంచాయతీలోని చినరూనెల, బూరుగు గ్రామాల వారు 15 కిలోమీటర్లు కాలినడకన వచ్చి గిరిజనులు ఓటు వేశారు. ఐటీడీఏ అధికారులు లోతట్టు గ్రామాలు, కొండశిఖర గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని ఆయా గ్రామాల ఓటర్లు విజ్ఞప్తి చేశారు.

కొయ్యూరులో...

కొయ్యూరు: మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 43,178 ఓటర్ల కోసం పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో 29,001 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోగా మేరకు రమారమి 67 శాతం మేర ఓటింగ్ నమోదైంది. ఓటుహక్కు వినియోగించుకున్న వారిలో పురుషులు 13,571, మహిళలు 15,430 ఉన్నారు. వీటిలో అత్యంత మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించిన ఎం.భీమవరం, యు.చీడిపాలెం, బూదరాళ్ల పంచాయతీల్లో 10 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. వీటిలో ఎం.భీమవరం (పోలింగ్ కేంద్రం నంబరు 79)లో 988 ఓటర్లుకు 577 పోలయ్యాయి. గతంలో ఎన్నికల్లో మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో నిర్వహించిన పోలింగ్‌లో వచ్చిన పోలింగ్ శాతం కన్నా ప్రస్తుత ఎన్నికల్లో సుమారు 30 శాతం ఉండేవారు. డౌనూరు, మర్రివాడ, కొమ్మిక పోలింగ్ కేంద్రాలలో నిర్ణీత సమయానికి ఓటర్లు క్యూ కట్టారు. అధిక సంఖ్యలో ఉండటంతో డౌనూరు, కొమ్మికలో 7 గంటల వరకు మర్రివాడలో 8-30 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాలలో నిర్దేశిత సమయానికి ప్రశాంతంగా పోలింగ్ ముగియడంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

గూడెంకొత్తవీధిలో...

గూడెంకొత్తవీధి, మే 13: మండలంలో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. పోలింగ్ ముగిసే సమయానికి 51శాతం ఓటింగ్ జరిగిందని అధికారులు చెబుతున్నప్పటికీ, అధికారికంగా తెలియాల్సి వున్నది. మండలంలో 56 పోలింగ్ బూత్‌లలో 51,666 మంది ఓటర్లు ఉన్నారు. అత్యధిక పోలింగ్ కేంద్రాల్లో ఉదయం ఏడు గంటల నుంచే ఓటు వేసేందుకు క్యూలో నిల్చొన్నారు. మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. కుంకుంపూడి, జీకే వీధి, రింతాడ, ఏబులం, పెదవలస, దామనాపల్లి పోలింగ్ కేంద్రాల్లో అధికంగా క్యూ అధికంగా కనిపించింది. వర్షం కారణంగా ఏబులం పోలింగ్ కేంద్రంలో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరిగింది. దివ్యాంగులు, వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

జి.మాడుగులలో...

జి.మాడుగుల: మండలంలోని 17 పంచాయతీల్లోని 61 శాతం పోలింగ్ నమోదైంది. దాదాపు 61 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరిగాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, పలు చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో ఆలస్యంగా ఓటింగ్ సరళి ప్రారంభమైంది. జి.మాడుగుల, బీరం పంచాయతీ వి.కోడాపల్లి తదితర పోలింగ్ కేంద్రాల్లో ఆలస్యంగా ఓటింగ్ ప్రారంభం కావడంతో ఓటర్లు లైన్లో ఉండి ఇబ్బందులు పడ్డారు. ఉబ్బాసింగి, కోరాపల్లి పోలింగ్ కేంద్రాల్లో టెంట్ సదుపాయాలు లేక ఓటర్లు ఎండలో ఇబ్బందులు పడ్డారు. జి.మాడుగుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పాడేరు జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట, టీడీపీ అభ్యర్థిని గిడ్డి ఈశ్వరి ఎన్నికల సరళిని పరిశీలించారు.

పెదబయలులో...

పెదబయలు: మండలంలోని 47 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7 గంటలకు ఎన్నికలు ప్రారంభం కావ్వాల్సి ఉండగా, ఈవీఎంలు మొరాయించడంతో గంట తరువాత మొదలు పెట్టారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రలో ఉమ్మడి అభ్యర్థి పాంగి రాజారావు కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే అరకు ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ తన స్వగ్రామం సీకరిలో తన ఓటు వేశారు. బొండపల్లి పంచాయతీ కేంద్రంలో పోలింగ్ కేంద్రం చేరటానికి కడబంగి, టొట్టోడిపుట్టు, గొడ్డిపుట్టు గ్రామాలకు చెందిన ఓటర్లు ఐదు కిలోమీర్లు దూరంలో రెండు గెడ్డలు దాటుకుంటూ కాలినడకన ఎళ్లారు.

ముంచంగిపుట్టులో...

ముంచంగిపుట్టు: మండలంలోసార్వత్రిక ఎన్నికల్లో 55.85 శాతం పోలింగ్ జరిగింది. 23 పంచాయతీల పరిధిలోని 50 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఓటర్లు ఉదయం 7 గంటల నుంచే బారులు తీరారు. సాయంత్రం నాలుగు గంటలు వరకు ఓటింగ్ జరిగింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రంలో జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఓటు వేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ముందుకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె సూచించారు. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అన్ని వర్గాల వారు ఊపిరి పీల్చుకున్నారు.

డుంబ్రిగుడలో...

డుంబ్రిగుడ: మండలంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పోలింగ్ కేంద్రాల్లో ఉదయం ఆరు నుంచి బారులు తీరారు. మధ్యాహ్నం ఎండను లెక్క చేయకుండా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు వరుసలో నిల్చొని ఓటును వినియోగించుకున్నారు. మండల కేంద్రం డుంబ్రిగుడలోని పోలింగ్ కేంద్రంలో అరకు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభిషేక్, ఎన్నికల వ్యయ అంచన పరిశీలకులు గురుకరణ్‌సింగ్ సందర్శించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి కురిసిన వర్షాన్ని లెక్క చేయకుండా ఓటును వినియోగించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలుచోటు చేసుకోకుండా పోలీసు యంత్రాంగం బందోబస్తు ఏర్పాటు చేశారు.

హుకుంపేటలో...

హుకుంపేట: మండలంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. హుకుంపేట బూత్‌కు ఉదయం 7.30 గంటలకే రిటర్నింగ్ అధికారి, పీవో అభిషేక్ వచ్చి పరిశీలించారు. ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యమైందని అధికారులు తెలిపారు. అర్హులైన వారంతా ఓటు వేయడానికి ముందుకు రావాలని ఈ సందర్భంగా ఆర్‌వో కోరారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌వో బి.రవి కుమార్, సీఐ నాయుడు, ఎంపీడీవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


సీలేరులో ఓటు కోసం గుర్రంపై వచ్చిన మహిళ


ముంచంగిపుట్టులో మండుటెండలో నిరీక్షిస్తున్న మహిళలు


జి.మాడుగుల: ఉబ్బాసింగిలో ఓటు కోసం పోటెత్తిన గిరిజనం


కొయ్యూరు: ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఎంపీ మాధవి


హుకుంపేటలో ఓటర్లతో మాట్లాడుతున్న ఆర్‌వో అభిషేక్

ఎవరి ధీమా వారిది!!

... 5వ పేజీ తరువాయి

అభ్యర్థిగా కూటమి తరఫున పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ కనీసం 50 వేల నుంచి లక్ష ఓట్ల మెజారిటీతో గెలుస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎంపీ అభ్యర్థులకు రెండు పార్టీలలోను క్రాస్ ఓటింగ్ జరిగినట్టు సమాచారం. భీమిలి, గాజువాక, విశాఖ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో కొందరు ఓటర్లు ఎమ్మెల్యే అభ్యర్థికి ఒక పార్టీకి ఓటు వేసి, ఎంపీ అభ్యర్థికి వేరే పార్టీకి వేసినట్టు ప్రచారం జరుగుతోంది. నగరంలో చాలామంది వైసీపీ అభిమానులు ఎమ్మెల్యే ఓటు ఆ పార్టీకే వేసి ఎంపీ ఓటు టీడీపీకి వేసినట్టు చెబుతున్నారు.

విశాఖ తూర్పులో హోరాహోరీ

విశాఖ తూర్పు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు కనీసం 20 వేల ఓట్ల మెజారిటీతో గెలిచి నాలుగోసారి విజయం సాధిస్తారని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. అయితే వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎంవీవీ సత్యనారాయణకు ఓటమి చరిత్ర లేదని, ఆయనే తూర్పులో విజయం దక్కించుకుంటారని ఆయన వర్గం ఘంటాపథంగా చెబుతోంది.

భీమిలిలో గంట మోగనుందా?

భీమిలి నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు భారీ మెజారిటీతో గెలుస్తారని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. జిల్లాలో ఆయనకే ఎక్కువ మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తంచేస్తున్నారు. అయితే అదంతా ప్రచారమేనని వైసీపీ అభ్యర్థి ముత్తంశెట్టి(అవంతి) శ్రీనివాసరావు గెలుపు ఖాయమని వైసీపీ పెద్దలు అంటున్నారు.

గాజువాకలో పల్లాకు మొగ్గు

గాజువాకలో వైసీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌కు పరాభవమే మిగులుతుందని, టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు విజయం ఖాయమైపోయిందని ప్రచారం జరుగుతోంది. మంత్రిగా ఉండి అమర్‌నాథ్ జిల్లా ఏమీ చేయలేకపోయారనే విమర్శలు ఉన్నాయి.

పశ్చిమంలో టైట్ ఫైట్

పశ్చిమ నియోజవర్గంలో టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్య గట్టి పోటీ జరిగింది. ఇక్కడ మూడోసారి ఎమ్మెల్యేగా గెలవాలని టీడీపీ అభ్యర్థి గణబాబు సర్వశక్తులు ఒడ్డగా, ఎలాగైనా విజయం సాధించి ఈసారి శాసనసభకు వెళ్లాలని వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ గట్టి ప్రయత్నమే చేశారు. ఎక్కడా ఖర్చుకు వెనుకాడలేదు. మల్కాపురం, సింధియా తదితర పారిశ్రామిక ప్రాంత ప్రజలు ఎవరికి అండగా నిలిస్తే వారే గెలుస్తారనేది టాక్. ఇద్దరిలో ఎవరు గెలిచినా అతి తక్కువ ఓట్ల మెజారిటీయే ఉంటుందని సమాచారం.

ఉత్తరంలో ఓట్లను చీల్చిన జైభారత్

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు, వైసీపీ అభ్యర్థి కేకే రాజు గెలుపు కోసం హోరాహోరీ పోరాటం చేశారు. అయితే ఇక్కడ జైభారత్ పార్టీ తరఫున వీవీ లక్ష్మీనారాయణ పోటీలో నిలిచారు. ఆయన చీల్చే ఓట్లు తీవ్ర ప్రభావం చూపనున్నాయి.

విశాఖలో జనసేన జెండా రెపరెపలు

విశాఖ జిల్లాలో ఈసారి జనసేన జెండా ఎగురుతుందని ఆ పార్టీ వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. దక్షిణ నియోజకవర్గంలో ఆ పార్టీ తరఫున పోటీ చేస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్ తొలుత కాసింత ఇబ్బంది ఎదుర్కొన్నా ఆ తరువాత బాగా పుంజుకున్నారు. టీడీపీ సహకారంతో పాటు వైసీపీ అభ్యర్థి వ్యతిరేకులు కలిసి రావడం అదృష్టంగా మారింది.

పెందుర్తిలో సామాజిక వర్గాల వారీగా చీలిక

పెందుర్తి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు, వైసీపీ అభ్యర్థి అదీప్ రాజుల మధ్య నువ్వా?, నేనా? అనే పోటీ జరిగినట్టు చెబుతున్నారు. నియోజకవర్గంలోని మండలాల్లో ఓటర్లు సామాజికవర్గాలకు ప్రాధాన్యమిస్తూ తమ వారికి అనుకూలంగా ఓటింగ్ చేశారు. అధికార పార్టీ అభ్యర్థిపై తీవ్రమైన భూకబ్జాల ఆరోపణలు ఉన్నందున అవే తనకి మైనస్‌గా మారాయని చెబుతున్నారు. పంచకర్లకు టీడీపీ నుంచి బలమైన సాయం ఉండటంతో జనసేనకి జై కొట్టిస్తారని అంటున్నారు.

పాడేరు, అరకులోయలోనూ అదే ధీమా

... 5వ పేజీ తరువాయి

ఉన్నారు. అయితే ఈసారి ఎన్నికల్లో ఓటింగ్ శాతం తగ్గడం సైతం ఎవరికి లాభిస్తుందో... ఎవర్ని ముంచేస్తుందోననే చర్చ మన్యంలో జోరుగా జరుగుతున్నది.

అనకాపల్లి జిల్లాలో గెలుపెవరిదో?

అనకాపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం జరిగిన పోలింగ్ సరళిని బట్టి ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపుపై అంచనాలు వేసుకుంటున్నారు. ఎంపీ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ స్థానాలు తమవేనని కూటమి అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే సంక్షేమ పథకాలు తమను ఆదుకుంటాయని వైసీపీ అభ్యర్థులు నమ్మకంతో ఉన్నారు. అయితే ఈసారి ఓటింగ్ సరళిని చూస్తే ఉద్యోగులు, యువత అధిక సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొనడంతో వైసీపీకి ఎదురు దెబ్బ తప్పదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

రాజ్యసభ సభ్యుడిగా పనిచేసిన అనుభవం, కేంద్రంలో బీజేపీ పెద్దలతో తనకున్న సంబంధాలతో ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని, అనకాపల్లి అభివృద్ధికి కృషిచేస్తానని బీజేపీ అభ్యర్థి సీఎం రమేశ్ హామీ ఇవ్వడంతో ఓటర్ల నుంచి సానుకూల స్పందన వచ్చినట్టు కూటమి నాయకులు అభిప్రాయపడుతున్నారు. కాగా మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన అనుభవం, అన్ని వర్గాల ప్రజలతో మమేకం కావడంతో విజయం తననే వరిస్తుందని వైసీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు ధీమాగా ఉన్నారు.

అసెంబ్లీ అభ్యర్థుల్లో కూడా..

కూటమి తరఫున కొణతాల రామకృష్ణ(అనకాపల్లి), రమేశ్‌బాబు(పెందుర్తి), విజయకుమార్ (ఎలమంచిలి) నియోజకవర్గాల్లో జనసేన అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు. అయ్యన్న పాత్రుడు (నర్సీపట్నం), బండారు సత్యనారాయణ మూర్తి (మాడుగుల), కేఎస్ఎన్ఎస్ రాజు(చోడవరం), వంగలపూడి అనిత(పాయకరావుపేట) నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారు. కూటమి మేనిఫెస్టో అన్ని వర్గాల ప్రజ లను ఆకర్షించడంతో ఓటర్లు తమ వైపే మొగ్గు చూపారని కూటమి అభ్యర్థులు అంచనా వేస్తు న్నారు. సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయని వైసీపీ అభ్యర్థులు భరత్‌కుమార్ (అనకాపల్లి), కన్నబాబురాజు(ఎలమంచిలి), ధర్మశ్రీ (చోడవరం), ఉమాశంకర్‌గణేశ్(నర్సీపట్నం), కంబాల జోగులు(పాయకరావుపేట), అనురాధ (మాడుగుల), అదీప్‌రాజ్(పెందుర్తి) నమ్మకంతో ఉన్నారు. వీరిలో ఎవరు విజయం సాధిస్తారనే దానిపై జోరుగా చర్చ సాగుతోంది.

ఉదయం ఎండ.. మధ్యాహ్నం వాన

▸▸ మన్యంలో భిన్న వాతావరణం

పాడేరు, మే 13 (ఆంధ్రజ్యోతి): మన్యంలో సోమవారం భిన్న వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంది. అయితే మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి భారీ వర్షం కురిసింది. అనంతగిరిలో 32.6, అరకులోయలో 34.2, చింతపల్లిలో 33.8, డుంబ్రిగుడలో 33.7, జీకే వీధిలో 33.2, జి.మాడుగులలో 35.2, హుకుంపేటలో 32.1, కొయ్యూరులో 37.1, ముంచంగిపుట్టులో 34.8, పాడేరులో 38.0, పెదబయలులో 32.6 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

చింతపల్లి, జీకే వీధి మండలాల్లో..

గూడెంకొత్తవీధి/చింతపల్లి: చింతపల్లి, జీకే వీధి మండలాల్లో మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సోమవారం ఉదయం నుంచి ఎండ కాయగా, మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి మూడున్నర గంటల వరకు కుండపోత వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులన్నీ వాగులను తలపించాయి. లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో నిండాయి. అయితే పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్‌కి తీవ్ర అంతరాయం కలిగింది. పోలింగ్ భవనంలో ఉన్న ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. వర్షం తగ్గిన తరువాత ఓటర్లు యథావిధిగా ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఎండ తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న పాడేరు అంబేడ్కర్ సెంటర్... చింతపల్లిలో కురుస్తున్న వర్షం

నేటి నుంచి మోదకొండమ్మ మూలవిరాట్ దర్శనం నిలుపుదల



పాడేరురూరల్, మే 13: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం, గిరిజన ప్రాంత ప్రజల ఇలవేల్పు పాడేరు మోదకొండమ్మ మూలవిరాట్ దర్శనం మంగళవారం నుంచి తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మూడు రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు అలంకరణ(పెయింటింగ్) పనులు చేపట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ఉత్సవాల ప్రారంభ రోజున అమ్మవారి మూల విరాట్ దర్శనం పునఃప్రారంభించే అవకాశం ఉంది. కాగా అప్పటి వరకు ఆలయానికి వచ్చిన భక్తులు ఉత్సవ విగ్రహాన్ని దర్శించుకొని పూజలు చేసుకోవాలని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రత

▸▸ అదనపు ఎస్పీ ప్రతాప్ శివకిశోర్

చింతపల్లి, మే 13: సబ్ డివిజన్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని స్థానిక అదనపు ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ చెప్పారు. చౌడుపల్లి, చింతపల్లి పోలింగ్ కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సీఆర్‌పీఎఫ్, గ్రేహౌండ్స్, సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీలతో భద్రత కల్పించామన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో కూబింగ్, ప్రధాన కేంద్రాల్లో వాహనాల తనిఖీలు జరుగుతున్నాయన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అదనపు పోలీసు బలగాలను ఏర్పాటు చేశామన్నారు. బలపం, అమ్మవారి ధారకొండ, సప్పర్ల, ధారకొండ, జర్రెల, మొండిగెడ్డ, యూ చీడిపాలెం పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. సబ్ డివిజన్ పరిధిలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, ఎన్నికలు ప్రశాంతగా జరిగాయన్నారు. గిరిజనులు స్వేచ్ఛగా ఓట్లు వేశారని ఆయన చెప్పారు.

జిల్లాలో ఓట్లేసిన ప్రముఖులు


సిరా గుర్తు చూపుతున్న గిడ్డి ఈశ్వరి, విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దంపతులు, పాంగి రాజారావు, మత్స్యలింగం, అప్పలనర్స, బాలరాజు

పాడేరు, మే 13 (ఆంధ్రజ్యోతి): పాడేరు, అరకు నియోజకవర్గాల్లో పలువురు ప్రముఖులు, అభ్యర్థులు, ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయసునీత పాడేరులోనే ఓటు వేశారు. అలాగే తలారిసింగి పోలింగ్ కేంద్రంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిడ్డి ఈశ్వరి, జి.మాడుగుల మండలం రాసవీధి పోలింగ్ కేంద్రంలో వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరావు ఓట్లేశారు. పాడేరులో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు నరసింగరావు దంపతులు, అరకు బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాంగి రాజారావు పెదబయలు మండలం సీకరి పోలింగ్ కేంద్రంలో ఓటేయగా, వైసీపీ అభ్యర్థి రేగం మత్స్యలింగం స్వగ్రామం హుకుంపేట మండలం కొంతెలిలో ఓటేశారు. సీపీఎం అరకు ఎంపీ అభ్యర్థి పి.అప్పలనర్స స్వగ్రామం అరకు మండలం బొండం గ్రామంలో, మాజీ మంత్రి పి.బాలరాజు జీకే వీధిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.